క్లుప్తంగా

బెల్ట్ షాపులు కొనసాగకుండా చూడాలి



ఎస్సైకు వినతి పత్రం సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో బెల్ట్ షాపులు కొనసాగకుండా చూడాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆమె ఎస్సై శంకర్‌కి వినతి పత్రం సమర్పించారు. స్టేషన్ పరిధిలోని పలు కాలనీలలో బెల్ట్‌షాపులు ఎక్కువయ్యాయని తెలిపారు. యువకులకు గంజాయి సరఫరా చేసే వారిని పట్టుకోవాలన్నారు. కాలనీలు, బస్తీల్లో నిఘా పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు దుర్గయ్య, సదానంద్, సహదేవ్, రాములు వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ లైన్ల రీకండక్టరింగ్ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి సబ్‌స్టేషన్ ఏఈ వినాయక్ రాథోడ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ కొంపల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు సెంట్రల్ పార్క్, కుమ్మరి బస్తీ, ఆంధ్ర బస్తీ, కొంపల్లి మున్సిపల్ కార్యాలయ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



రామస్వామి (ఫైల్)

సుభాష్‌నగర్: ఫ్లెక్సీని వేరే చోటికి మారుస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వెంకటేశరావు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని రసూల్‌పురకు చెందిన రామస్వామి (45) సూరారం శివాలయ నగర్‌లోని ఓ వైన్స్ వద్ద చుదువ అమ్ముతూ జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం 12గంటల సమయంలో వైన్స్ ముందు ఉన్న ఫ్లెక్సీని వేరే చోటికి తరలిస్తుండగా పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి విద్యుత్ సరఫరా కావడంతో రామస్వామి కుప్పకూలాడు. దీంతో వైన్స్ నిర్వాహకులు స్థానికంగా ఉన్న ఆసుపత్రికి చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబాన్ని ఆదుకోవాలి..

విషయం తెలుసుకున్న మృతుని కుటుంబీకులు పెద్ద ఎత్తున ఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

కృష్ణారెడ్డికి ఘనంగా నివాళి



కృష్ణారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దుండిగల్: భౌరంపేట మాజీ సర్పంచ్ ఎస్వీ కృష్ణారెడ్డి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. భౌరంపేటలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్‌గా, రాజకీయ నేతగా ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ సురేందర్‌రెడ్డి, ఎస్వీ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గీతంలో స్మార్ట్ ఐడియాథాన్ ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: గీతం స్మార్ట్ ఐడియాథాన్ (అత్యుత్తమ ఆవిష్కరణలు చేసిన విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమం) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, రుద్రారం ప్రాంగణంలో గురువారం లాంఛనంగా ప్రారంభించారు. స్టార్టప్ ఇండియా, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎమర్జింగ్ మార్కెట్స్ (సీఈఎం), బోస్టన్లోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఎంటర్ ప్రేన్యూర్ షిప్ ఎడ్యుకేషన్ (ఎన్‌యూసీఈఈ) సహకారంతో నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిలుగా హైదరాబాద్ ఏంజెల్స్ చైర్మన్ రాజేష్ మంతెన, ఆత్మీయ అతిథిగా కంట్రోల్ ఎస్ క్వాలిటీ– ప్రొక్యూర్మెంట్ హెడ్ చంద్రశేఖర్‌శర్మ గరిమెళ్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత జీవితంలో రాణించడానికి ఉపకరించే ప్రాథమిక అంశాలైన ఉత్సుకత, ధైర్యం,శీలం, భావప్రకటనా నైపుణ్యాలపై పట్టు పెంచుకోవాలని వివరించారు. అనంతరం ఉన్నత విద్యా సంస్థలలోని విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదిగే వాతావరణాన్ని ఎలా సృష్టించాలి అనే అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించారు.

నిరసనలో కార్మికులు.. దుర్వాసనతో కాలనీలు



సర్కిల్ కార్యాలయం వద్ద కార్మికుల ఆందోళన

- ఎక్కడికక్కడ పేరుకుపోతున్న చెత్తాచెదారం
- నిరసనలోనే చెత్తను తొలగించే కార్మికులు
- దుర్గంధం, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- న్యాయం జరిగే వరకు విధుల్లోకి రామంటున్న కార్మికులు

కుత్బుల్లాపూర్: పారిశుద్ధ్య కార్మికులు మూడు రోజులుగా జంట సర్కిల్ కార్యాలయాల వద్ద ఆందోళన చేస్తూ ఉండటంతో ప్రధాన రోడ్లు, కాలనీలు చెత్తాచెదారంతో కనిపిస్తున్నాయి. ప్రధానంగా మార్కెట్ ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. గడిచిన మూడు రోజులుగా కుత్బుల్లాపూర్ – గాజులరామారం జంట సర్కిల్‌లో పనిచేస్తున్న సుమారు 882 పారిశుద్ధ్య కార్మికులు తమను పర్మనెంట్ చేయాలని ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే.

ఐదేళ్లుగా పర్మనెంట్ హామీని పట్టించుకోకపోవడంతో..

◆ ప్రభుత్వం గతంలో ఎన్నికల మేనిఫెస్టోలో ఔట్సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని చెప్పి ఐదేళ్లు గడుస్తున్నా ఇంత వరకు పట్టించుకోకపోవడంపై కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకొని పర్మనెంట్ చేయాలని కోరారు. వీరికి వామపక్షాల నేతలతో పాటు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు.

మేయర్ న్యాయం చేస్తామని చెప్పినా..

బుధవారం గ్రేటర్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశంలో సైతం ఇదే విషయంపై ప్రతిపక్ష కార్పొరేటర్లు ఆందోళన చేయగా మేయర్ గద్వాల విజయలక్ష్మి ప్రభుత్వంతో మాట్లాడి పర్మనెంట్ విషయంపై తప్పకుండా న్యాయం చేస్తామని చెప్పిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ప్రభుత్వంపై పోరాడే దిశగా కార్మికులు సిద్ధమయ్యారు.

◆ దీంతో కుత్బుల్లాపూర్‌లో (67 గ్రూపులు గ్రూప్‌లో ఏడుగురు చొప్పున మొత్తం 469 మంది), గాజులరామారంలో (59 గ్రూప్‌లో ఏడుగురు చొప్పున మొత్తం 413మంది) పనులు చేయకపోవడంతో జంట సర్కిళ్ల పరిధిలో చెత్తాచెదారం పేరుకుపోయింది. కాలనీల్లో తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏది ఏమైనా పారిశుద్ధ్య కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరుతున్నారు.



షాపూర్‌నగర్ మార్కెట్ రోడ్డులో..



గిరినగర్ ప్రధాన రోడ్డులో..



రంగారెడ్డినగర్ నందాపుడ్స్ సమీపంలో..



గాజులరామారం బంధం చెరువు వద్ద..



చింతల్ శ్మశానవాటికను ఆనుకుని..



గాంధీనగర్ ప్రధాన రోడ్డును ఆనుకుని..

డివిజన్లలో మహారాష్ట్ర ఎమ్మెల్యే పర్యటన

కుత్బుల్లాపూర్: తెలంగాణాలో బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉంటేనే ప్రతి పైసా అర్హులైన లబ్ధిదారులకు చేరుతుందని మహారాష్ట్ర ఎమ్మెల్యే సునీల్‌రాణే అన్నారు. విధాన సభ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా గురువారం బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డితో కలిసి ఆయన జీడిమెట్ల, కుత్బుల్లాపూర్ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యకర్తల సమిష్టి కృషితో జీడిమెట్ల కార్పొరేటర్ స్థానాన్ని కై వసం చేసుకున్నామన్నారు. ఇదే స్ఫూర్తితో అసెంబ్లీ స్థానంలో సైతం బీజేపీ జెండాను ఎగురవేద్దామన్నారు.

దేశవ్యాప్తంగా 20 కోట్ల కుటుంబాలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మోగా జయశ్రీ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఎంఎస్ వాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి భరత్‌సింహారెడ్డి, నటరాజ్ గౌడ్, బుచ్చిరెడ్డి, పులి బలరామ్, రాజేశ్వర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా కేకేఎం ట్రస్ట్



విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తున్న కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్

కుత్బుల్లాపూర్: కేకేఎం చారిటబుల్ ట్రస్ట్ పేద విద్యార్థులకు అండగా ఉంటుందని ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నేత కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం జీడిమెట్ల జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో పూర్వ ఉపాధ్యాయులు నర్సింహులు, శివశరణప్ప, శివానంద్‌ల చేతుల మీదుగా 600 మంది విద్యార్థులకు కేకేఎం ట్రస్ట్ తరపున నోట్ పుస్తకాలు, గడియారం, గొడుగులతో కూడిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ చేపట్టామన్నారు. తనకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీ చేపడతామన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థితి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 1985–86 బ్యాచ్ పూర్వ విద్యార్థులు బాలప్ప, కృష్ణారెడ్డి, వెంకటేష్, శ్రీరాములు, గోపాల్‌రెడ్డి, కూన అంజిగౌడ్, మల్లేష్ గౌడ్, తాళ్ల వెంకటేష్, మహిపాల్‌రెడ్డి, అంజయ్య, నాయకులు నర్సింగ్‌రావ్, పులి సందీప్, కేకేఎం ట్రస్ట్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



గొడుగులు, పుస్తకాలతో సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్: పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం చింతల్‌లోని పార్టీ కార్యాలయంలో 78 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ కింద మంజూరైన 48 లక్షల 70వేల 500 రూపాయలు విలువ చేసే చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ.. పేదలకు సీఎంఆర్ఎఫ్ వరంగా మారిందన్నారు. సంక్షేమ తెలంగాణ దిశగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

భారత శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలి



చంద్రయాన్–3 విజయంతో భారతదేశ శాస్త్రవేత్తల పట్టుదల ప్రపంచానికే తెలిసిందని నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కోల వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. నేటి తరం యువత వారిని ఆదర్శంగా తీసుకుని కొత్త ఆవిష్కరణలు చేయాలని ఆకాంక్షించారు. అంతరిక్ష ప్రయోగాల్లో చంద్రుడి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్–3 మిషన్ విజయవంతమైన నేపథ్యంలో గురువారం సూరారంలో విద్యార్థులతో కలిసి జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్కూల్ ఆవరణలో చంద్రయాన్–3పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

– సుభాష్‌నగర్

లారీ ఢీకొట్టడంతో యువకుడు మృతి

బాలానగర్: కాంక్రీట్ మిక్సర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె. భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌జిల్లా గోమారం గ్రామానికి చెందిన మనోహర్ (21) మెకానిక్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. వాహన సామాన్లు కొనుగోలు చేసేందుకు తన ద్విచక్ర వాహనంపై నగరానికి వచ్చాడు. నర్సాపూర్ చౌరస్తా నుంచి జీడిమెట్ల వెళుతుండగా కాంక్రీట్ మిక్సర్ లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో లారీని ఢీకొట్టి పడిపోగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటికి ఒక్కడే కొడుకు కావటంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. బాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జీడిమెట్ల: సూరారం తిరుమల ఎన్‌క్లేవ్‌లోని ఓ అపార్ట్‌మెంట్ రెండో అంతస్తులో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. సూరారం ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఫైర్ ఆఫీసర్ సుభాష్‌రెడ్డి వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి 10గంటలకు సూరారంలోని శ్రీలక్ష్మి నిలయం అపార్ట్‌మెంట్‌లోని రెండో అంతస్తులో ఏసీ షార్ట్‌సర్క్యూట్ వలన మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న సూరారం పోలీసులు విషయాన్ని వెంటనే జీడిమెట్ల అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది 15నిమిషాల్లో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఇంట్లో వారికి ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. ఇంట్లోని ఫర్నిచర్ కొంత మేరకు కాలిపోయాయి. ఈ మేరకు సూరారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

జీడిమెట్ల: గుట్టు చప్పుడు కాకుండా పేకాడుతున్న ఏడుగురిని జీడిమెట్ల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. పీఎస్ పరిధిలోని రాంరెడ్డినగర్ లారీ పార్కింగ్ ప్రాంతంలోని ఓ ఆఫీసులో పేకాడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో ఎస్సై అంజనేయులు, సిబ్బంది పేకాట స్థావరంపై దాడి చేశారు. అక్కడ పేకాడతున్న సుభాష్‌నగర్ లాస్ట్ బస్టాప్‌కు చెందిన పన్యాల కృష్ణారెడ్డి, సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన మేఘమ్మగారి కృష్ణారెడ్డి, కూకట్‌పల్లికి చెందిన మన్నె రాజశేఖర్, రాంరెడ్డినగర్‌కు చెందిన బాల లింగారెడ్డి, శామీర్‌పేటకు చెందిన మేడసాని దయాకర్ రెడ్డి, కుత్బుల్లాపూర్‌కు చెందిన తేనేటి శ్యాంసుందర్ రెడ్డి, రాంరెడ్డినగర్‌కు చెందిన దండు సుబ్బరాజులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.11890 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

డీసీఎం ఢీకొట్టడంతో కాలువలో పడిన కారు

స్వల్పగాయాలతో బయటపడిన ఇద్దరు



మురుగు కాలువలో పడిన కారు

దుండిగల్: సూరారంకాలనీ నుంచి దంపతులు తమ కారులో గండిమైసమ్మ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో శ్రీరాంనగర్ సమీపంలోని వేదిక ఫంక్షన్ హాల్ వద్ద వెనుక నుంచి వచ్చిన డీసీఎం వీరి కారును ఢీ కొట్టింది. కారు అదుపు తప్పి పక్కనే ఉన్న మురుగు గుంతలో పడింది. ఈ ఘటనలో దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు కారును వెలికి తీయించారు. కాగా ఈ ప్రమాదంపై దుండిగల్ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి

- రిటర్నింగ్ అధికారి సైదులు

కుత్బుల్లాపూర్: సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో ఆయన సెక్టోరియల్ ఆఫీసర్లు, ఏఆర్వోలు, పోలీస్ శాఖ అధికారులు, బీఎల్‌ఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్‌ల వారీగా ఓటర్ల లిస్టులో తప్పులు తడకలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముందస్తుగానే ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల ఉప కమిషనర్లు నాగమణి, మల్లారెడ్డి, కొంపల్లి, దుండిగల్, నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన ఎన్నికల రిటర్నింగ్ అధికారి సైదులు



హాజరైన బీఎల్‌ఓలు, ఏఆర్వోలు, పోలీస్ సిబ్బంది

పింఛన్ల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శం

కుత్బుల్లాపూర్: దివ్యాంగులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. గురువారం కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో దివ్యాంగులు, వృద్ధులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలంయాదవ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లను రూ.4016కు పెంచి వారికి భరోసా కల్పించారన్నారు. పింఛన్ల అమలులో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంగయ్యనాయక్, కమిషనర్ శ్రీహరి, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ సన్న కవిత, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.



పింఛన్లను అందజేస్తున్న చైర్మన్ శ్రీశైలంయాదవ్ తదితరులు

సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థ భారతి సిమెంట్

- మార్కెట్‌లోకి అల్ట్రాఫాస్ట్ సిమెంట్

కుత్బుల్లాపూర్: సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజినీర్ నితీష్‌యాదవ్ తెలిపారు. గురువారం కొంపల్లిలోని రామలింగేశ్వర ఎంటర్‌ప్రైజెస్ వద్ద తాపీ మేస్త్రీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నితీష్‌యాదవ్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని తెలిపారు.

◆ అల్ట్రాఫాస్ట్ సిమెంట్ ముఖ్యంగా స్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపికని పేర్కొన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడవుతారని తెలియజేశారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ రూ.20 అధికంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా 40 మంది తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయల ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. డీలర్ గణేష్ తోట మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందన్నారు.



తాపీ మేస్త్రీకి ప్రమాద బీమా బాండ్‌ను అందజేస్తున్న టెక్నికల్ ఇంజినీర్ నితీష్‌యాదవ్, డీలర్ తోట గణేష్

శ్రావణ శుక్రవార శోభ



శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా షాపూర్‌నగర్ మార్కెట్ వినియోదారులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి రోడ్డుకు ఇరువైపులా పూలు, పండ్లు వివిధ ఆకులను విక్రయానికి తీసుకొచ్చారు. ఒకరోజు ముందే మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి కొనుగోలు చేశారు.

– సుభాష్‌నగర్